# మినీ కథలు

"ఏమండీ బజారుకెళ్దామా ?" అంది ఆమె.

"ఏం కొనాలి?" ప్రశ్నార్థకంగా చూస్తూ. అన్నాడతను.

"కొనవలసినవి చాలా వున్నాయి. బజారుకి వెళ్ళిన తరువాత యింకేమైనా గుర్తుకు వస్తాయేమో చూడాలి" అంది ఆమె.

"కావలసినవన్నీ ఒక కాగితంమీద వ్రాసుకో. లేకపోతే కొనవలసినవి మర్చిపోయి అవసరం లేనివి తెచ్చే ప్రమాదముంది" అన్నాడతను.

కాసేపటికి లిస్టు తయారయింది. ఇద్దరూ బజారుకు బయలుదేరారు.

ఆమె ఒక షాపు ముందు ఆగి "ఏమండీ పట్టకారు పాడయిపోయింది. ఇక్కడ వున్నాయి తీసుకుందామా ?" అంది.

"తీసుకో" అన్నాడతను.

పదిహేను నిమిషాలకు పట్టకారు బేరం కుదిరింది. ఆమె పట్టకారు కొని బాగ్‌లో వేస్తుండగా అతను అన్నాడు "చెప్పిన ధర కన్నా ఎంత తగ్గించాడు."

"పావలా" అంది ఆమె గర్వంగా.

కొంచెం ముందుకు వెళ్ళిన తర్వాత చీపురుకట్టలు కనిపించాయి.

"ఏమండీ చీపురు తీసుకుందాం."

"ఇంట్లో ఉందిగా !"

"అది అరిగిపోయింది."

"వెళ్ళేటప్పుడు కొనుక్కుని రిక్షాలో పెట్టుకు వెళ్ళవచ్చు. ఇప్పుడు ఈ చీపురు కట్ట పుచ్చుకుని బజారులో నడుస్తుంటే అందరూ మననే చూస్తారు."

"ఏమండీ ఈ చేతిరుమాళ్ళు బావున్నాయి కదూ !"

"ఇంట్లో చాలా ఉన్నాయికదా !"

"ఇవి బావున్నాయి"

"అవసరం లేకపోయినా బావున్నాయని చూసినవన్నీ కొంటూ ఉంటే యివ్వాళ మనం షాపింగ్ పూర్తి చేసినట్లే" అన్నాడతను విసుగ్గా.

అతను చిరాకుగా. ఆమె ఆనందంగా ఆరు చేతిరుమాళ్ళు కొన్నారు.

కొంచెం ముందుకు వెళ్ళిన తరువాత అతను వెనుదిరిగి చూస్తే ఆమె లేదు. నాలుగు ప్రక్కలా కలయచూస్తే పూల దుకాణంముందు ఆమె కనిపించింది. ఆమె వెనుకగా నిలబడి "పూలు తీసుకోవటం అయిందా ?" అన్నాడు.

నిప్పులు కక్కుతూ జవాబుగా వచ్చిన చూపు చూసి హడిలిపోయాడు. తీరా చూస్తే ఆమె కాదు. సిగ్గుపడుతూ వెనుదిరిగాడు.

ఇంతలో ఇంకో పూల దుకాణం దగ్గర పూలుకొని అవి తల్లో పెట్టుకుంటూ ఆమె వచ్చి "ఎక్కడికి వెళ్ళారు" అంది.

అతను జవాబు చెప్పలేదు. మొహం కందగడలా వుంది. ఆమె వింతగా అతను వెళ్ళి వచ్చిన పూలదుకాణంవైపు చూసింది. అక్కడ తను కట్టుకున్న చీరలాంటి చీర ఒకామె కట్టుకుని వుంది. విషయం అర్థమయి ఆమెకు నవ్వాగలేదు.

ఇత్తడి సామాను షాపు కనిపించింది. ఆమె అందులోకి వెళ్ళి ఇత్తడి గిన్నె




బేరమాడుతోంది. "ఇప్పుడు మనకు గిన్నెలెందుకు ?" అన్నాడతను.

"ఆ మధ్య మీ అమ్మగారు వచ్చినప్పుడు యిలాంటి గిన్నె కావాలన్నారు."

"మళ్ళీ మా అమ్మ వచ్చినప్పుడు మీరిద్దరూ వచ్చి కొనుక్కోవచ్చులే."

"ఇలాంటి గిన్నె మళ్ళీ దొరుకుతుందో, లేదో !"

"ఈ గిన్నెలు యిప్పుడు రావటంలేదండీ ఇదివరకు వాటిలో ఎలా మిగిలిందో ఈ ఒక్కటీ వుంది" అన్నాడు షాపతను.

అతనేం మాట్లాడలేకపోయాడు. ఆమె గిన్నె కొనుక్కుని బయటకు వచ్చింది.

"మా అమ్మ యిలాంటి చీర కావాలని ఎన్నో రోజులనుంచి అనుకుంటున్నది" అందామె చేనేత చీరల దుకాణం దగ్గర.

అతను వినిపించుకోకుండా వడివడిగా అడుగులు వేశాడు.

అద్దాల షోకేసుల్లో రకరకాల వస్తువులు తొంగి చూస్తుంటే ఆమెకు చెల్లెళ్ళు గుర్తుకు వచ్చారు. హడావిడిగా షాపులో ప్రవేశించింది. అతను ముందు గమనించలేదు. ఎదురుగా షాపులో ఆమె కనిపిస్తే ప్రక్కకి తిరిగి చూశాడు. ఆమె లేదు. కావలసినవి కొనుక్కుని వస్తుందికదా! అని బయట నిలబడ్డాడు.

గంట గడిచిపోయింది. అతనికి విసుగ్గా. అసహనంగా వుంది. కాళ్ళు పీకుతున్నాయి. ఎంతకీ ఆమె బయటకు రావటం లేదు. ఫాన్సీ షాపులో ఆడవాళ్ళు క్రిక్కిరిసి వున్నారు. ఒకామె చెవులకు ఏవో తగిలించి అద్దంలో చూసుకొంటోంది. ఇంకొకామె మెడలో ఏదో వేసుకుని చూసుకొంటోంది. షాపువాళ్ళు ఓర్పుగా "మీ ఆనందమే మా పరమావధి" అన్నట్లుగా విసుగు లేకుండా అన్నీచూపించి ఒక్కొక్కసారి అద్దాలు పట్టుకోవటంలో కూడా సహాయపడుతున్నారు.

అంతమంది ఆడవాళ్ళలో ఆమె కనిపించలేదు. ఆ జన సమూహందాటి ఆమె బయటకు వచ్చినప్పటి సంగతి.

అతను తన నిస్సహాయస్థితికి తిట్టుకున్నాడు. ఇంకెన్నడూ ఆమెతో షాపింగ్‌కు రాకూడదని అప్పటికే పందసార్లు ఒట్టు పెట్టుకున్నాడు.

చెల్లెళ్ళకు, స్నేహితులకు, ఇంకా ఎవరికైనా ఉన్నాయేమో- చేతినిండా పాకెట్లతో బయటకు వచ్చిందామె.

"మనం ఇక యింటికి వెళ్ళిపోదాం" అన్నాడతను కోపాన్ని కప్పెట్టుకుంటూ.

"అప్పుడేనా ! యింకా కొనవలసిన లిస్టులో ఒక్కటి కూడా కొనలేదు" అందామె.

"ఇంకోరోజు ఎప్పుడైనా రావచ్చులే!"

అయిష్టంగానే ముందుకు కదిలింది. తన చేతిలోని బాగ్ అతని చేతికిచ్చింది. ఇద్దరూ కొంచెం ముందుకు నడిచారు. అతను రిక్షా పిలవబోతూ ప్రక్కకి తిరిగి చూశాడు. ఆమె లేదు. ఒక్క క్షణం గుండె గుభిల్లుమంది. అప్పటివరకూ ప్రక్కనేవుండి ఎవరో మాయం చేసినట్లు యింతలోనే ఏమయింది! షాపుల్లో చూసుకుంటూ వెనక్కి నడిచాడతను.

ఒక షాపులో తీరికగా కూర్చుని జాకెట్ బట్టలు చూస్తోందామె.

బజారుకు వచ్చి చాలా సేపయినా కాని ఇంటికి వెళ్ళాలనే తొందర లేకుండా స్థిమితంగా కూర్చుని తీరికగా బట్టల బేరం చేస్తున్న ఆమెను చూస్తే అతనికి చాలా ఆశ్చర్యం కలిగింది. "ఈమె ఒక్కతే యిలా వుంటుందా ? లేక ఆడవాళ్ళంతా యింతేనా" అనే సందేహం కూడా కలిగింది.

